❖•❖•❖ 53 ❖•❖•❖

# తెరవబడిన సమాధుల స్వరము

*“యేసు మరల బిగ్గరగా కేక వేసి, ప్రాణము విడిచెను, అప్పుడు, దేవాలయపు తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను; భూమి వణకెను; బండలు బద్దలాయెను; సమాధులు తెరవబడెను; నిద్రించిన అనేక మంది పరిశుద్ధుల శరీరములు లేచెను. వారు సమాధులలో*

*నుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి" (మత్తయి 27:50-53).*

యేసు తన తుది శ్వాస విడిచినప్పుడు బండలను బద్దలుచేసి భూమిని వణికించిన ఒక భూకంపము వచ్చినదనియు, అప్పుడు కొన్ని "సమాధులు తెరవబడెను; నిద్రించిన అనేక మంది పరిశుద్ధుల శరీరములు లేచెను; వారు సమాధులలో నుండి బయటికి వచ్చి ఆయన లేచినతరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి" అని మత్తయి నివేదించుచున్నాడు (మత్తయి 27:52, 53). దేవాలయపు తెర చినుగుట గూర్చి వ్రాయుటలో మార్కు మరియు లూకా కూడ మత్తయితో కలిసారు (మార్కు 15:38; లూకా 23:45). కానీ మత్తయి మాత్రమే భూకంపమును, సమాధులు తెరవబడుటను, మరియు పరిశుద్ధులు యెరూషలేములో అగపడుటను గూర్చి పేర్కొనుచున్నాడు.

అవశ్యముగా, సమాధులు తెరవబడినప్పుడు రెండు అద్భుతములు పేర్కొనబడినవి, మొదటిదిగా సమాధులు వాటంతటఅవే తెరవబడుట మరియు రెండవదిగా క్రీస్తు పునరుత్థానము తరువాత జరుగు పునరుత్థానములు. ఇవి పరస్పరము ఒకదానితో మరొకటి సంబంధము కలిగియున్నప్పటికిని, అవి క్రీస్తు బలియాగము పూర్తియైనదని తెలియజేయుచు దేనికదే స్వతంత్రంగా నిలుచు సంకేతములై యున్నవి.

సమాధులు తెరవబడుట భూమిని వణికించి దానిలో పగుళ్లు కలుగజేసిన భూకంపము వలన కలిగిన ఒక సహజ పర్యవసానమును మించినదై యుండినది. ఈ తుది అభిప్రాయమును కనీసము రెండు వాస్తవములైనా సమర్థిస్తున్నాయి. మొదటిది, ఎంపిక చేయబడిన కొన్ని సమాధులు, కొందరి పరిశుద్ధుల సమాధులు, తెరవబడినవని మత్తయి స్పష్టంగా చెప్పుచున్నాడు. రెండవదిగా, ఈ సమాధులు శుక్రవారంనాడు తెరవబడి యేసు పునరుత్థానుడైన తరువాత వరకు తెరచుకునే ఉన్నవి, అప్పుడు ఆ సమాధులలో నిద్రించియుండినవారు లేచి యెరూషలేములో అగుపించారు. అలాగైతే, "సమాధులలో నిద్రించియుండినవారు మూడు రోజుల వరకు లేపబడనప్పుడు, సమాధులు శుక్రవారం మధ్యాహ్నమే ఎందుకు తెరవబడినవి? సరికదా తెరవబడిన సమాధులలో నిద్రించి యుండిన పరిశుద్ధులు ఆదివారం వరకు ఎందుకు కదలకుండా మెదలకుండా లేవకుండా వాటిల్లోనే ఉండిపోయారు?" అని మనము సహజంగానే ప్రశ్నిస్తాము. ఆదివారమున తెల్లవారుచుండగా "మహా భూకంపము కలిగెను" అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 28:2), కానీ సమాధులు తెరవబడునట్లు దేవుడు ఈ భూకంపమును వాడుకొనలేదు. దేవుడు అలా చేసియుంటే, ఆయన లోకమునకు ఇవ్వవలెనని ఆశించిన సూచన నిచ్చుటకుగాను దైవీకమైన తన సంకల్పములను నెరవేర్చినవాడయ్యేవాడు కాడు.

అలాగైతే, పరిశుద్ధులు నిద్రించుచుండిన కొన్ని సమాధులు తెరవబడినవనుటలో గల అర్థమేంటి? సమాధులను తెరచుట దేవుడు యేసు మరణము గూర్చి ఇచ్చిన ఒక ఏకైక, అద్భుతకరమైన సంకేతముగా నిలుచును.

*మొదటిగా, సమాధులు తెరవబడుట యేసు మరణము విశ్వాసముతో ఆయన యొద్దకు వచ్చువారికి అమర్త్యతను మరియు జీవమును తెచ్చినదని సూచించిన ఒక ఖచ్చితమైన సాంకేతిక సంకేతమై యుండినది.* మన నిత్యజీవ నిరీక్షణ యేసు మరణము వలననే కలుగుచున్నది.

మనము జీవించియుండునట్లు ఆయన మరణించాడు. ఈ సత్యము నిమిత్తము యేసు మరణించిన సమయంలో దేవుడు యెరూషలేములోను ఆ పట్టణ చుట్టుప్రక్కలను ఉండిన సమాధులను తెరచుటకు మించిన మరొక యుక్తమైన సంకేతమును దేనిని ఇవ్వాలి?

క్రీస్తు యేసు, "మరణమును నిరర్థకము చేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను" అని పౌలు వ్రాయుచున్నాడు (2 తిమోతి 1:9-10). "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" అని లాజరు సమాధి యొద్ద యేసే ఘోషించాడు (యోహాను 11:25, 26ఎ). సంచలనాత్మకమైన శక్తితో, సమాధులు తెరవబడుట సమాధిపై క్రీస్తు మనకిచ్చిన విజయమును గూర్చి సాక్ష్యమిచ్చింది. తెరవబడిన సమాధులు వేసిన కేక గూర్చి, "విజయమందు మరణము మ్రింగివేయబడెను. 'ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ?" అని పౌలు మాటల్లో చెప్పుకొనవచ్చును (1 కొరింథీయులకు 15:54బి, 55).

*రెండవదిగా, యేసు అపవాది యొక్క ప్రధానులపైనను అధికారులపైనను విజయము సాధించాడని తెరవబడిన సమాధులు ప్రకటించాయి.* ఒక విశిష్టమైన భావములో చెప్పుకుంటే అపవాది మానవ జాతిని మరణపు పట్టులో చుట్టుముట్టి యుండున్నాడు. దీనిని హెబ్రీ పత్రిక రచయిత ఇలా వివరిస్తున్నాడు, "... మరణము యొక్క బలముగలవానిని, అనగా, అపవాదిని, మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయన (యేసు) కూడ రక్తమాంసములలో పాలివాడాయెను" (హెబ్రీయులకు 2:14బి, 15). యేసు మరణంలో, అపవాది యొక్క అధికారులు, రాజ్యములు, మరియు నియంత్రణలు నశింపజేయబడినవి. "దేవుడు ... మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి ..." అని పౌలు వ్రాయుచున్నాడు (కొలొస్సయులకు 2:13-15). ఇంతేగాక, ఈ రుణ పత్రమును సిలువకు కొట్టిన క్షణము, ఆయన "ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి" మరియు "జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచిన" క్షణమై యుండిందని కూడ పౌలు చెప్పుచున్నాడు (కొలొస్సయులకు 2:13-15). యేసు, మరణించినప్పుడు, ఆకాశమండలమందలి యుగ పోరాటము అంతమయ్యింది. యేసు అపవాది మరియు మరణ శక్తులన్నిటిపై గెలుపొందిన విజయీభవుడయ్యాడు. ఈ వాస్తవమును గూర్చిన సంకేతము దేవుడు సమాధులను తెరచుటయను అద్భుతమును మించిన మంచిది మరొకదానిని దేనిని ఎన్నుకోవాలి?

*మూడవది, చివరి విశ్లేషణగా యేసు మరణము ప్రభువునందు విశ్వసించి ఆయనకు విధేయులైయుండువారి నిమిత్తమై యున్నదను వాస్తవము గూర్చిన భావము* సమాధులు తెరవబడుటలో కలదు. యెరూషలేము చుట్టుప్రక్కల ఉండిన సమాధులన్నీ తెరవబడలేదు, పరిశుద్ధుల సమాధులు కొన్ని మాత్రమే తెరవబడినవి. "పరిశుద్ధులు" అను పదము యేసు మరణమునకు పూర్వము జీవించియుండి దేవుని చిత్తమును నిబద్ధతతో నెరవేర్చి మరణించినవారిని సూచించుచున్నది. అనగా, విశ్వాసముతో మరణించినవారికి లేదా మరణించనై యున్నవారికి ఆయన మరణము విమోచనమును సమకూర్చింది లేదా సమకూర్చుతుందనునది తెరవబడిన సమాధుల సందేశమై యుండినదని మరో మాటలో

చెప్పుకొనవచ్చును.

ఔను, యేసు ప్రతి ఒక్కరికొరకు మరణించాడు. "దేవుని కృపవలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించునట్లు, దూతల కంటె కొంచెము తక్కువవాడుగా చేయబడిన యేసు మరణము పొందినందున, మహిమాప్రభావములతో కిరీటము ధరించినవానిగా ఆయనను చూచుచున్నాము" అని హెబ్రీయులకు 2:9 చెప్పుచున్నది. ఏదిఏమైనా, ప్రతి ఒక్కరు రక్షింపబడరు. నాశనమునకు పోవు మార్గములోనికి "అనేకులు" ప్రవేశిస్తారని యేసు చెప్పాడు (మత్తయి 7:13, 14). యేసు "తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను" అని లేఖనములు అతిస్పష్టంగా బోధించుచున్నవి (హెబ్రీయులకు 5:9బి). విశ్వాసముతో విధేయులగుట ద్వారా ఆయన రక్తము పవిత్రపరచును. యేసు మరణము విధేయుల కొరకుద్దేశింపబడినదని పరిశుద్ధులు చెప్పుటకు సమాధులు తెరవబడుటను మించిన మరొక విదితమైన సంకేతము ఎన్నుకొనబడలేకపోయింది.

*నాల్గవది, క్రీస్తుచేత లోకములోనికి ప్రవేశపెట్టబడిన రక్షణ యొక్క నిత్య స్వభావమును తెరవబడిన సమాధులు ప్రకటించాయి.* యేసు మరణమునకు మునుపు జీవించి మరణించిన పరిశుద్ధుల సమాధులు మాత్రమే తెరవబడినవి. పాత నిబంధన అంతా క్రీస్తు మరణమునకు ఆశతో ఎదురుచూసింది. యేసు లోక పాపముల నిమిత్తము తనను తాను అప్పగించుకొన్నప్పుడు, ఆయన రక్తము యొక్క కార్యసార్థక రక్షితయుగములలో ముందుకు వెళ్లింది మరియు వెనుకకు కూడా వెళ్లింది – వెనుకకు, ఆయన మరణమునకు మునుపు మరణించిన పరిశుద్ధులందరి కొరకును ముందుకు, భవిష్యత్తులో ఆయన యొద్దకు వచ్చువారందరికొరకును ఆ రక్తము చిందింపబడింది.

మొదటి నిబంధన, పాత నిబంధన క్రింద విశ్వాసులుగా ఉండినవారు, ఆయన రక్తముచేత రక్షింపబడినారని హెబ్రీ పత్రిక రచయిత చెప్పుచున్నాడు: "ఈ హేతువుచేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధములనుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున, పిలువబడినవారు నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానమును పొందు నిమిత్తము ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు" (హెబ్రీయులకు 9:15). ఇంతేగాక, యేసు, మన గొప్ప ప్రధాన యాజకుడుగా, మొదట తన సొంత పాపముల కొరకు తరువాత ప్రజల పాపముల కొరకును దినదినము బలులను అర్పింపవలసిన అవసరత లేకుండెను అని కూడా వ్రాయుచున్నాడు. లేదు ఆ అవసరత లేకుండెను, ఏలయనగా ఆయన "తన్నుతాను అర్పించుకొన్నప్పుడు ఒక్కసారే యీ పనిచేసి ముగించెను" (హెబ్రీయులకు 7:27బి). యేసు మరణము ఒక్కసారే జరిగే మరణమై యున్నది: "ఆలాగుననే క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి, తన కొరకు కనిపెట్టుకొని యుండువారి రక్షణ నిమిత్తము పాపము లేకుండా రెండవసారి ప్రత్యక్షమగును" (హెబ్రీయులకు 9:28). యేసు మరణము సమస్త మానవుల నిమిత్తమైన, సార్వత్రికమైన మరణమని దేవుడు సాక్ష్యమిచ్చినట్లు, ఆయన పాత నిబంధన కాలము నుండి తనవారిలోని కొందరు పరిశుద్ధుల సమాధులను అద్భుతకరమైన రీతిలో తెరచుటకు ఎన్నుకొన్నాడు.

*ఐదవది, యేసు మన పాప విమోచనము నిమిత్తము చేసిన బల్యర్పణను దేవుడు అంగీకరించాడని శక్తివంతముగా తెరవబడిన సమాధులు వ్యక్తము చేసినవి.* మన ఘన విజయము యేసు పునరుత్థానుడగుట వలన సాధింపబడలేదు. అది సిలువలో సాధింప

బడింది. పునరుత్థానము ఆయన మరణము యొక్క ప్రామాణికతను ధ్రువీకరించింది. యేసు తన తుది శ్వాస విడిచిన వెనువెంటనే మూడు అద్భుతములు సంభవించాయి – భూమి వణకుట, దేవాలయపు తెర చినుగుట, ఈ సమాధులు తెరవబడుట. యేసు బలియాగమును లోక పాపముల పరిహారార్థమైన బల్యర్పణగా తండ్రియైన దేవుడు అంగీకరించాడని ఇవన్నీ వెవ్వేరైన మరియు విశిష్ఠమైన రీతులలో చాటిచెప్పుచున్నవి. ఎట్టకేలకు ఈ అంగీకారమును పునరుత్థానము ప్రకటించింది.

అలాగైతే, తెరవబడిన సమాధుల సాక్ష్యమేమైయున్నది? యేసు మరణించినప్పుడు, దేవుడు పాత నిబంధన పరిశుద్ధుల సమాధులను తెరచాడు. అద్భుతకరమైన ఈ సంకేతము యేసు మరణమును సాక్షాత్తూ రూఢిపర్చింది. యేసు మనకు జీవము నిచ్చుటకును, సాతాను నుండి మరణ అధికారమును తీసివేయుటకును, ఆయనయందు విశ్వసించి ఆయనకు విధేయులగువారిని మాత్రమే ఆయన మరణము ప్రభావితులను చేస్తుందను భావమును తెలుపుటకును, ఆయన మరణ కాలము, ప్రజలు, దేశములు, మరియు దైవవిధివిధానములను మించినదై అత్యున్నత స్థాయిలో నిలుస్తుందని మనకు చూపించుటకును మరణించాడని దేవుడు ఈ అద్భుతము ద్వారా తెలియజెప్పుచున్నాడు. అది సమస్త సంఘటనలకు, దేవుడు మానవునికి తన హృదయాన్నే బయలుపర్చుకొన్న సంఘటనకు మిన్నయైన సంఘటనయై యుండింది మరియు ఇప్పటికిని ఎప్పటికిని మిన్నయైన సంఘటనయై యుంటుంది.

❖◆❖◆❖

*సమాధి దేవుని అధికారమును తాళజాలదు. భూమి మరణించినవారిని సమాధులలోనే బంధించియుండజాలదు. సముద్రము అది మ్రింగివేసినవారిని దానిలో దాచుకొనజాలదు. భూమి మీద నున్నదైనను పాతాళమందున్నదైనను ఏ అధికారమును క్రీస్తు మరణించినవారి శరీరములను బంధించియుంచజాలదు. సమాధి యొక్క అధికారము సిలువ మీద ఇప్పటికీ బద్దలుచేయబడింది. తెరవబడిన సమాధులిచ్చుచున్న సాక్ష్యము ఇదే.*[1]

*"కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున, ఆ ప్రకారమే మరణము యొక్క బలము గలవానిని, అనగా అపవాదిని మరణముద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణ భయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయనకూడ రక్తమాంసములలో పాలివాడాయెను" (హెబ్రీయులకు 2:14, 15).*

---

సూచన

[1]Gordon H. Girod, *Words and Wonders of the Cross* (Grand Rapids, Mich.: Baker Book House, 1962), 139.